కల్తీ మద్యం కలకలం



కేటీదొడ్డి మండలం పాత పాలెంలో పట్టుకున్న స్పిరిట్, కల్తీ మద్యం బాటిళ్లు(ఫైల్)

చీప్ లిక్కర్ తాగి జోగుళాంబ గద్వాలలో దినసరి కూలీ మృతి



గద్వాల పట్టణంలో పర్మిట్ రూమ్‌లో మంగళవారం మృతి చెందిన దౌలత్‌పీర్

- మద్యం కల్తీపై జిల్లాలో గతంలో కేసులు నమోదు
- లిక్కర్ కింగ్ మళ్లీ రంగంలోకి.. లిక్కర్ కల్తీ
- ఎన్ని కేసులు నమోదైనా పీడీ యాక్టు పెట్టని అధికారులు
- కర్ణాటక మద్యం తెచ్చి జిల్లాలో కల్తీ వ్యాపారం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జోగుళాంబ గద్వాల జిల్లాలో మళ్లీ కల్తీ మద్యం కలకలం చెలరేగింది. పట్టణంలోని ఓ వైన్స్ షాపులో చీప్ లిక్కర్ తాగిన దినసరి కూలీ మృతి చెందడం సంచలనంగా మారింది. గతంలో కూడా జిల్లా పరిధిలో కల్తీ మద్యం తయారీ, స్పిరిట్ అక్రమ రవాణా, నకిలీ లేబుళ్లతో మద్యం తరలింపు, కర్ణాటక, గోవా నుంచి మద్యం తీసుకువచ్చి కల్తీ చేయడం వంటి ఘటనలు ఎన్నో నమోదయ్యాయి. అటు ఎక్సైజ్ అధికారులు, ఇటు పోలీసులు కూడా కేసులు నమోదు చేస్తున్నా.. 2022 నుంచి పెద్దగా కల్తీ మద్యం ఘటనలు వెలుగులోకి రాలేదు. తర్వాత ప్రభుత్వం కూడా మారడంతో కొంతకాలం స్తబ్దుగా ఉన్న మద్యం రాకెట్ ముఠా మళ్లీ దందాను ప్రారంభించినట్లు తెలుస్తోంది. గద్వాల జిల్లాలో ప్రధానంగా పేద ప్రజలే ఎక్కువగా ఉంటారు. ఇక్కడ రోజువారీ సంపాదన కూడా చాలా తక్కువ. వచ్చిన కూలీ డబ్బుల్లో ఖరీదైన మద్యం తాగలేక చీప్ లిక్కర్‌ను ఎక్కువగా తాగుతారు. దీన్ని ఆసరాగా చేసుకున్న ముఠా... చీప్ లిక్కర్‌నే కల్తీ చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో లిక్కర్ కింగ్‌గా పేరుగాంచిన ఓ ప్రబుద్ధుడు ముఠాకు మళ్లీ నేతృత్వం

(మిగతా 6లో..)

పాతపాలెం కేంద్రంగా..

ఇప్పటివరకు గద్వాల జిల్లా పరిధిలో నమోదైన కల్తీ మద్యం, మద్యం అక్రమ తరలింపు, నకిలీ బ్రాండ్ల సృష్టి, దొంగ లేబుళ్లు తయారు చేసి బెల్టు, వైన్స్ షాపులకు తరలించడం, కర్ణాటక నుంచి స్పిరిట్ తెచ్చి, ఇక్కడ కల్తీ మద్యాన్ని తయారు చేయడం, పలు ప్రీమియం బ్రాండ్ల మద్యాన్ని జడ్చర్ల, కొత్తకోట, అలంపూర్, కర్నూలు, షాద్‌నగర్‌కు జాతీయ రహదారిపై ఉన్న మద్యం దుకాణాలకు తరలించడం వంటి కేసులు నమోదయ్యాయి. ఇందులో మెజారిటీ కేసులు కేటీ దొడ్డి మండలం పాతపాలెం కేంద్రంగా ఉన్న వ్యక్తులతోనే నమోదయ్యాయి. ఇందులో చాలావరకు కేసులు ఇప్పటికీ అతీగతీ లేకపోగా.. మెజారిటీ సందర్భాల్లో అధికారులు కూడా చూసిచూడనట్లు వ్యవహరించారు. గద్వాల జిల్లాకు సరిహద్దుగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు ఉండగా, అక్కడ కూడా పాతపాలెం వ్యక్తులపై కేసులు నమోదయ్యాయి. లిక్కర్ కింగ్ పలువురు యువతను నియమించుకుని.. భారీ మొత్తంలో చెల్లింపులు చేస్తూ ఈ కల్తీ మద్యం రాకెట్‌ను నడిపిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఇంపీరియల్ బ్లూ, మెక్ డొవెల్స్ వంటి బ్రాండ్లలో కర్ణాటక నుంచి బ్లాక్ మేజిక్ చీప్ లిక్కర్‌ను తెచ్చి కలిపి.. ఈ రాకెట్ నడిపించారని తెలుస్తోంది. ఇప్పుడు ఏకంగా చీప్ లిక్కర్‌నే కల్తీ చేస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి చీప్ లిక్కర్‌లో సాధారణ బ్రాండ్ల కంటే స్పిరిట్, ఆల్కహాల్ శాతం ఎక్కువగా ఉంటుంది. దాన్ని ఇంకా కల్తీ చేయడం ద్వారా అది ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా శారీరకంగా దృఢంగా లేని వారిపై మరింత తొందరగా ప్రభావం చూపుతుందని వైద్యులు పేర్కొంటున్నారు.

వనపర్తి కీర్తి కిరీటంలో

మరో కలికితురాయి

- ఐటీ టవర్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- రూ.22 కోట్లు మంజూరు చేస్తూ జీవో జారీ



గత ప్రభుత్వ హయాంలో ఐటీ టవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అప్పటి మంత్రులు కేటీఆర్, నిరంజన్‌రెడ్డి

వనపర్తి అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వనపర్తి కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరింది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) టవర్ జిల్లాకు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వ హయాంలో వనపర్తి మండల పరిధిలోని నాగవరం సమీపంలో సర్వే నెంబరు 167లోని 2ఎకరాల భూమిలో మాజీ మంత్రి కేటీఆర్‌తో ఐటీ టవర్ నిర్మాణానికి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. తాజాగా రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లి తాజాగా ఐటీ టవర్ నిర్మాణానికి అనుమతులతో పాటు రూ.22 కోట్లు మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వనపర్తి పట్టణ సమీపంలో 2 ఎకరాలలో ఐటీ టవర్ నిర్మాణాన్ని 25వేల చదరపు అడుగులలో ఏకకాలంలో 250 మంది ఐటీ ప్రొఫెషనల్స్ పని చేసుకునే విధంగా సౌకర్యంగా ఏర్పాటు చేయనున్నారు. ఈ ఐటీ టవర్ నిర్మాణంతో గ్రామీణ ప్రాంతంలో ఐటీ హబ్‌ల ను అభివృద్ధి చేయడంతో పాటు, సామాజిక ఆర్థిక అభివృద్ధితో పాటు యువ తకు ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. ఈ ఐటీ టవర్ నిర్మాణంతో ఉన్నత చదువులు అభ్యసించిన విద్యార్థులకు స్థానికంగానే ఉపాధి కల్పన దొరుకుతుంది. ఐటీ టవర్ నిర్మాణం కానుండటంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ వల్లే



- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

వనపర్తిలో విద్యాభ్యాసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ వల్లే ఐటీ టవర్ మంజూరు అయింది. ఐటీ టవర్ నిర్మాణం ఒక సంవత్సర కాలంలో పూర్తి చేసుకునే విధంగా లక్ష్యాన్ని నిర్ణయించుకున్నాం. 25వేల చదరపు అడుగులలో భవన నిర్మాణం జరుగుతుంది. ఈ భవనంలో 250 మంది ఐటీ ప్రొఫెషనల్స్ పని చేసుకునే విధంగా ఉంటుంది.

స్థానిక విద్యార్థులకు ఉపాధి



- ఎమ్మెల్యే మేఘారెడ్డి

జిల్లాలో ఐటీ టవర్ నిర్మాణంతో స్థానికంగా ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు ఉపాధి కల్పన ఏర్పడుతుంది. రోజు రోజుకు అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో ఐటీ రావడం మరింత అభివృద్ధి చెందుతుంది. ఐటీ టవర్ మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇన్‌చార్జి మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎంపీ మల్లు రవికి ప్రత్యేక కృతజ్ఞతలు.

ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేలా

అధికారులు సన్నద్ధం కావాలి

- కలెక్టర్ బీఎం సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయితీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులకు ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ ఎన్నికల కోసం నియమించిన స్టేజ్-1, స్టేజ్-2 ఆర్‌వోలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన కీలక సూచనలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలన్నదే తమ ప్రధాన లక్ష్యమన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం ముందుస్తుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని 255 గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణ బాధ్యతను నిర్వర్తించేందుకు అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన హ్యాండ్ బుక్‌లోని నిబంధనలను పూర్తిగా అధ్యయనం చేయాలని, ఏమైనా సందేహాలు ఉంటే మాస్టర్ ట్రైనర్లను సంప్రదించి అవగాహ న పెంచుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీపీవో శ్యాంసుందర్, రిటర్నింగ్ అధికారులు ఉన్నారు.

వెనుకబడిన జాతుల అభివృద్ధే

కాంగ్రెస్ లక్ష్యం

- రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి



సోమశిలలో ఉమ్మడి జిల్లా స్థాయి ఆదివాసి శిక్షణ తరగతులను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

6

సల్లంగా చూడమ్మ జములమ్మ తల్లీ..

- ఘనంగా పౌర్ణమి వేడుకలు
- పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే దంపతులు
- దర్శించుకొన్న 50వేల మంది భక్తులు

7



పూనకంలో మహిళా భక్తురాలు

పౌర్ణమి వేడుకలకు తరలివచ్చిన భక్తులు



నెత్తిపైకి బోనాలు తీసిన భక్తులు

జన జాతర

- మన్యంకొండకు పోటెత్తిన భక్తులు
- రథోత్సవంలో వేలాదిగా పాల్గొన్న ప్రజలు
- మారుమోగిన గోవిందనామ స్మరణ
- కోనేరు, కల్యాణకట్ట, క్యూలైన్ల రద్దీ
- పోలీసుల భారీ బందోబస్తు



కాలినడకన వస్తున్న భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవానికి భక్తులు పోటెత్తారు. ఉమ్మడి జిల్లాతో పాటు కర్ణాటకలోని రాయచూరు, యాద్గిర్ ప్రాంతాల నుంచి పిల్లాపాపలతో కలిసి వాహనాల్లో, (మిగతా 6లో..)





కోనేరు వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు

ట్రాఫికర్ మత్ కరో..

- జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణకు కృషి
- గత 13 నెలల్లో 34,254 కేసులు నమోదు
- హెల్మెట్ లేని 24,979 కేసులకు గాను రూ. 3,60,500 జరిమానా

6



ఆత్మకూరు జూరాల గ్రామంలో పౌల్ట్రీ ఫామ్‌లో కోళ్లను పరిశీలిస్తున్న అధికారుల బృందం

చికెన్ ధరలు చతికిల..

- తగ్గిన కోడి మాంసం ధరలు
- చికెన్ విక్రయాలపై బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్
- కొనుగోలుదారులు లేక చికెన్ దుకాణాలు వెలవెల
- అప్రమత్తమైన జిల్లా అధికార యంత్రాంగం

వనపర్తి అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పక్క రాష్ట్రంలో పౌల్ట్రీ ఫామ్‌లలో కోళ్లకు వ్యాపిస్తున్న బర్డ్ ఫ్లూ వ్యాధితో లక్షల సంఖ్యలో కోళ్ల మృత్యువాత పడుతున్నాయి. ఈ ఎఫెక్ట్ ఉమ్మడి జిల్లాలోని చికెన్ ధరలపై పడింది. బర్డ్ ఫ్లూతో కోళ్ల మృత్యువాత పడుతుండటంతో ప్రజలు చికెన్ తినాలంటేనే జంకుతున్నారు. కోళ్లకు బర్డ్ ఫ్లూ వ్యాధి విస్తృతంగా వ్యాప్తి చెందే లక్షణం ఉండటంతో ప్రజలు చికెన్ కొనుగోలు చేసేందుకు వెనకడుగు వేస్తున్నారు. ప్రస్తుతం ఈ బర్డ్ ఫ్లూ వ్యాధి మన జిల్లాలోని కోళ్లకు సోకకున్నా, సోషల్ మీడియాలో వచ్చే వదం తులతో ప్రజలు చికెన్ తినాలంటేనే జంకుతున్నారు.

తగ్గిన కోడి మాంసం, గుడ్ల ధరలు

సహజంగా కోడి మాంసం, కోడిగుడ్ల ధరలు కార్తీక, శ్రావణ మాసంతో పాటు వేసవిలో తగ్గుముఖం పడతాయి. ఆ తరువాత యథావిధిగా కోడి మాంసం, గుడ్ల ధరలు పెరుగుతాయి. కానీ ప్రస్తుతం ప క్క రాష్ట్రంలో విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న బర్డ్ ఫ్లూ వ్యాధితో లక్షల్లో కోళ్ల మృత్యువాత చెందుతూ ఉండటంతో ఆ ఎఫెక్ట్ జిల్లాలోని చికెన్ దుకాణాలపై పడింది. గత మూడు రోజుల క్రితం కిలో చికెన్ రూ.220 ఉండగా ప్రస్తుతం రూ.200, 190కి పడిపోయింది. అదే విధంగా కోడిగుడ్ల ధరలు ఒక ట్రే 30 గుడ్లకు రూ.180 ఉంటే రూ.160కి పడిపోయాయి. ధరల పతనం కూడా పౌల్ట్రీ రంగంపై ప్రభావం చూపనుంది.

అప్రమత్తమైన అధికారులు

పక్క రాష్ట్రంలో కోళ్లకు బర్డ్ ఫ్లూ వ్యాధి విస్తృతంగా సోకుతుండటంతో జిల్లాలోని పౌల్ట్రీ రంగానికి ఆ వ్యాధి సోకకుండా జిల్లా అధికార పశుసంవర్థక శాఖ యంత్రాంగం అప్రమత్తమైంది. ఆ శాఖ ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో 40 మంది అధికారుల బృందంతో పౌల్ట్రీ ఫామ్‌ల దగ్గరికెళ్లి తనిఖీలు చేపడుతున్నారు.

అధికారుల బృందంతో విస్తృతంగా తనిఖీలు

జిల్లాలో ఇప్పటి వరకు కోళ్లకు బర్డ్ ఫ్లూ వ్యాధి సోకలేదు. 40 మంది అధికారుల బృందంతో పౌల్ట్రీ ఫామ్‌లను తనిఖీలు చేపడుతున్నాం. అక్కడక్కడ అనారోగ్యంతో కోళ్ల చని పోయినా కూడా పరీక్షలు నిర్వహిస్తున్నాం. జిల్లాలో చికెన్ కొనుగోలుపై ఎలాంటి ఆంక్షలు లేవు.

- పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి

జేఈఈ మెయిన్స్‌లో 'ప్రతిభ' విద్యార్థుల దూకుడు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం , డైరెక్టర్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాల్లో మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు దూకుడు ప్రదర్శించారు. కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ పర్సంటైల్ సాధించారు. కె.కేదారినాథ్ 98.28, ఎన్.వర్షిత్‌గౌడ్ 98.15, జీఎల్ఎస్ఎస్ వాత్సల్య 98.06, ఎం.విశాల్ 97.12, నాగకౌశిక 96.95, సి.జతిన్ 96.03, కె.భరత్ 96.16, ఎం.భాను ప్రదీప్ 95.43, పి.సాయిజస్వంత్‌రెడ్డి 95.39, ఎ.శశిశంకర్ 94.3, వి.సాకేత్ 94.19, అంజనీ చరస్య రాఘవ్ 94.01, ఎ.నరేశ్ 93.20, జి.వైష్ణవి 93.84, ఎన్.అభిరామ్ 92.99, కె.మల్లేశ్ 92.42 , కె.మానస 92.1 పర్సంటైల్ సాధించారు. ఫలితాల్లో 90 పర్సంటైల్‌కు పైన 42 మంది విద్యార్థులు, 80 నుంచి 90 పర్సంటైల్ మధ్య 51 మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తంగా 219 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డైరెక్టర్లు కె.మంజులాదేవి, వి.లక్ష్మారెడ్డి, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, కె.జనార్దన్‌రెడ్డి, జి.వెంకటేశ్వర్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ వెంకట్రామయ్య, ఎన్.వెంకట్‌రెడ్డి, ఎం.కృష్ణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో కొత్తకోట విద్యార్థికి 99.49



కొట్టం అక్షయ్‌రెడ్డి

కొత్తకోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కొత్తకోట పట్టణానికి చెందిన కొట్టం అక్షయ్‌రెడ్డి జేఈఈ మెయిన్ సెషన్-1లో 99. 49 పర్సంటైల్ సాధించి ఆదర్శంగా నిలిచాడు. హరిత, అమృత్‌రెడ్డి దంపతుల రెండవ అబ్బాయి అక్షయ్‌రెడ్డి 10వ తరగతి వరకు కొత్తకోట ప్యూపిల్స్ స్కూల్‌లో అభ్యసించి 10 బై 10 గ్రేడ్ మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. హైదరాబాద్ రావిరాళ్లలోని నారాయణ జూనియర్ కలాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. జాతీయ స్థాయిలో 99. 49 పర్సంటైల్ సాధించడంతో తల్లిదండ్రులు బంధువులు బుధవారం అక్షయ్‌రెడ్డిని అభినందనలు తెలిపారు.

సంగాల విద్యార్థిని ప్రతిభ



దీక్షిత

గద్వాల సర్కిల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గత నెలలో జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ మెయిన్ సెషన్-1 ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో గద్వాల మండలం సంగాల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు వేణుగోపాల్‌రెడ్డి కూతురు దీక్షిత జాతీయ స్థాయిలో 99.49 శాతం మార్కులు సాధించి తన ప్రతిభను చాటుకుంది. ప్రస్తుతం దీక్షిత హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ముంబయిలోని ఐఐటీ సీటు సాధించడమే తన లక్ష్యమని దీక్షిత తెలిపింది. జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

కొత్తకోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కానాయపల్లి గ్రామ శివారులోని ఎస్సీ హాస్టల్ సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ దేవాలయంలో శ్రీకృష్ణ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. 13న కొత్తకోటలోని అంబాభవాని ఆలయం నుంచి కలశాలతో శోభయాత్ర నిర్వహించి అనంతరం హోమ పూజలు నిర్వహించనున్నారు. 14న ఆలయంలో ప్రతిష్ఠించే శ్రీకృష్ణ విగ్రహ, ధ్వజస్తంభాలకు వేదపడింతులచే ప్రత్యేక పూజలు, 15న శ్రీకృష్ణ విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠానలు కొనసాగనున్నాయి. ఈ ప్రతిష్ఠాపన పూజల నిమిత్తం భక్తుల సౌకర్యార్థం ఆలయ సమీపంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. అలాగే పూజలు కొనసాగే మూడు రోజులు పూజల్లో పాల్గొనే, తిలకించడానికి వచ్చే భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేయనున్నారు.

వెనుకబడిన జాతుల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

» రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి

కొల్లాపూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన జాతుల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ వారిని రాజకీయ ఉపాధి రంగాల్లో రాణించేలా అవగాహన కల్పిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక ఎక్సైజ్ సాంస్కృతిక పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం కొల్లాపూర్ మండల పరిధిలోని సోమశిల గ్రామంలో కాటేజీలలో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఏఐసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి ఆదివాసి కాంగ్రెస్ శిక్షణ శిబిరం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కొల్లాపూర్ మాజీ జడ్పీటీసీ నెనావత్ హనుమంత్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఆదివాసి గిరిజన నాయకులు, కార్యకర్తల శిక్షణ తరగతులను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగాలలో వెనుకబడి ఆదివాసీలందరూ అన్ని రంగాల్లో ఎదగాలని వనరులను ఉపాధిగా తీర్చిదిద్దుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని మంత్రి పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా వెనుకబడి ఉన్న ఆదివాసీలు అభివృద్ధి సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ట్రైనింగ్ సెంటర్‌లోని ఏర్పాటు చేసి వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీల్లో చైతన్యం తెచ్చేందుకు రాజకీయ ఉపాధి శిక్షణ తరగతులు నిర్వహించిందని, ఈ అవకాశాలను సద్వినియోగపరుచుకుని ఆదివాసీలు రాణించాలని జూపల్లి పిలుపునిచ్చారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, తెలంగాణ ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్‌లను గిరిజన నాయకులు శాలువా, పూలమాలతో ఘనం గా సన్మానించారు.

మరో రెండు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులకు గిరిజన ఎమ్మెల్యేలు జాతీయ కాంగ్రెస్ నాయకులు హాజరవుతారని మహబూబ్ నగర్ జిల్లా నాయకుడు లింగన్న నాయక్ పేర్కొన్నారు.

ఈ శిక్షణ తరగతులలో వివిధ అంశాలపై బోధించడానికి ప్రొఫెసర్లు, సైకాలజిస్టులు, రాష్ట్ర మంత్రులు, రాష్ట్రంలోని గిరిజన ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలంగాణ ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ తెలిపారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణా తీర ప్రాంతంలో టూరిజం అభివృద్ధి



లాంచీలో ప్రయాణం చేస్తున్న మంత్రి జూపల్లి తదితరులు

అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించే విధంగా కొల్లాపూర్ నల్లమల కృష్ణా తీర ప్రాంతాల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో టూరిజం అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం టూరిజం ఎండీ ప్రకాష్ రెడ్డి ఫారెస్టు డీఎఫ్‌వో రోహిత్ గోపిడీలతో కలిసి కొల్లాపూర్ మండల పరిధిలోని సోమశిల కృష్ణానదిపై మంత్రి లాంచి ప్రయాణం చేశారు. పెంట్లవెల్లి మండలం మల్లేశ్వరం శివారులో చుట్టూ కృష్ణానది పర్యాటకులను ఆకర్షించేలా ఉండే ద్వీపంను పరిశీలించారు. అక్కడి నుంచి కొల్లాపూర్ మండలం అమరగిరి గ్రామ పరిసరాలలో కృష్ణానది మధ్యలో ఉండే ద్వీపం ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... తెలంగాణ టూరిజం అభివృద్ధిలో భాగంగా వివిధ రకాల పథకాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి టూరిజం అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని నల్లమల కృష్ణా తీర ప్రాంతాలైన సోమశిల, అమరగిరి ఈగలపెంట శివారులో నల్లమల సర్క్యూట్ పరిధిలో టూరిజం అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దేశం నలుమూలల నుంచి పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చే పర్యాటకులకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అన్ని వసతులు, సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కృష్ణానది తీర ప్రాంతాల్లో పర్యాటకులు బస చేసేందుకు అతిథి గృహాలు రెస్టారెంట్లు వివిధ రకాల సౌకర్యాలు కల్పిస్తూ వారు నదీ తీరంలో పర్యటించేలా కొత్త హంగులతో బోట్లను ఏర్పాటు చేస్తామన్నారు.

ఎక్కడికో వెళ్లి పర్యాటక ప్రాంతాలు సందర్శించే కన్నా స్థానికంగా ఉన్న పర్యాటక ప్రాంతాలను నెలలో ఒక్క రోజైనా చూసి తీరాలని అప్పుడే జీవితం సార్థకమవుతుందని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ అమరేందర్, డీఎస్పీ శ్రీనివాస్, జిల్లా ఫారెస్టు రేంజర్ చంద్రశేకర్, తహసీల్దార్ విష్ణువర్ధన్ రావు, జిల్లా టూరిజం శాఖ అధికారి కల్వరాల నరసింహ, రెవెన్యూ పోలీస్ శాఖ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫికర్ మత్ కరో..

» జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణకు కృషి
» గత 13 నెలల్లో 34,254 కేసులు నమోదు
» డ్రంకెన్ డ్రైవ్‌లో 602, హెల్మెట్ లేని 24,979 కేసులకు గాను రూ. 3,60,500 జరిమానా
» మొత్తం రూ. 1.49 కోట్ల దాకా..
» ట్రాఫిక్ నియంత్రణపై 125 దాకా అవగాహన సదస్సులు



లారీ అసోసియేషన్ నాయకులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు,(ఫైల్)

గద్వాల క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో అదుపులో పెట్టేందుకు జిల్లా పోలీసులు రంగం సిద్ధం చేశారు. ప్రత్యేకంగా ట్రాఫిక్ సిబ్బంది లేకపోయినా కొందరు ఏఆర్ పోలీసులను ట్రాఫిక్‌ను నియంత్రించేలా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. పోలీసుల కన్నుకప్పి వాహనదారులు ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్ చేస్తూ ప్రమాదాల బారిన పడుతుండటంతో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల కంటే ట్రాఫిక్ సమస్య కేవలం జిల్లా కేంద్రంలో ఎక్కువగా ఉంది. దీని దృష్ట్యా ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ప్రత్యేకంగా 15 మంది ఏఆర్ సిబ్బందితో ట్రాఫిక్ బెల్టును ఏర్పాటు చేసి నియంత్రణపై చర్యలు చేపడుతున్నారు.

● 13 నెలల్లో 34,254కేసులు నమోదు

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో గత ఏడాది జనవరి నుంచి ఈ ఏడాది జనవరి 31 వరకు జిల్లాలో మొత్తం ఈ చలాన్‌ల కింద 34,254 కేసులు నమోదు కాగా, ఇందుకు గాను రూ. 1,38,81,535 జరిమానాలు విధించినట్లు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో కూడా ఈ చలాన్(నాన్ కాంటాక్ట్... ఆటోమేటిక్ కెమరా) ద్వారా 31,341 కేసులకు గాను రూ. 1,27,38,735 జరిమానా ఉండగా, ఈ చలాన్ (కాంటాక్ట్... ప్రత్యేకంగా ట్రాఫిక్ సిబ్బంది కెమరాల ద్వారా) 2913 కేసులు నమోదు చేసి రూ. 11,42,800 జరిమానాను విధించేలా చేసినట్లు తెలిపారు.

● డ్రంకెన్ డ్రైవ్‌లో 602 కేసులు నమోదు

జోగుళాంబ గద్వాల జిల్లాలో ముఖ్యంగా జిల్లా కేంద్రంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 602 మందిపై కేసులు నమోదు చేశారు. ఇందులో కోర్టుకు 493 మందిని పంపి వారి నుంచి కోర్టుకు రూ. 6,98,000 రుసుము చెల్లించేలా చూశామని ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు తెలిపారు. దీంతో పాటు హెల్మెట్ లేని వాహనాదారులను గుర్తించి 24,979 కేసులు నమోదు చేసి వారినుంచి ప్రభుత్వానికి రూ. 3,60,500 ఆదాయం సమకూరేలా చూశామని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి, మైనర్‌లకు వాహనాలిస్తున్న తల్లిండ్రులకు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తు న్నట్లు ఎస్ఐ తెలిపారు.

అలాగే ఇప్పటివరకు ఆటోలు, లారీలు, వాహనాల యజమానులతో 125 అవగాహన కార్యక్రమాలను నిర్వహించి ట్రాఫక్ నియంత్రణకు కృషి జరిగేలా చూశామన్నారు.

● ప్రత్యేక సీసీ కెమెరాల ద్వారా నిఘా

జోగుళాంబ గద్వాల జిల్లాలో ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇందులో కొన్ని కెమెరాలు జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో ఆటోమెటిక్ కెమెరాలను ఏర్పాటు చేయడంతో ఎవరైనా వాహనదారులు రాంగ్‌రూట్‌లో వెళ్లినా, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేసినా ఆటోమెటిక్‌గా జరిమానాలు పడుతున్నాయి. జిల్లాలో మొత్తం 1647 కెమెరాలు ఉండగా ఇందులో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఏర్పాటు చేసినవి 594, నేను సైతం ద్వారా ఏర్పాటు చేసినవి 1053 సీసీ కెమెరాలు ఉన్నట్లు జిల్లా పోలీసులు తెలిపారు..

ట్రాఫిక్ రహిత జిల్లా కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలి

జోగుళాంబ గద్వాల జిల్లాలో, ముఖ్యంగా గద్వాల జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యను పూర్తి స్థాయిలో నిర్మూలించేలా కృషి చేస్తాం. ప్రతీ వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తే ప్రమాదాల సంఖ్య వీలైనంత తక్కువగా ఉంటుంది. ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్ చేస్తే చర్యలు తీసుకుంటాం. అలా జంప్ చేయడం వల్ల ఎదురుగా వచ్చే వాహనానలతో ప్రమాదాలు సంభవిస్తాయి. ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు సహకరించాలి. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటాం. గద్వాల జిల్లాను ట్రాఫిక్ రహిత జిల్లాగా మారేలా ప్రతీ ఒక్కరు కృషి చేయాలి.

- శ్రీనివాసరావు, ఎస్పీ, గద్వాల

కల్తీ మద్యం కలకలం

(5వ పేజీ తరువాయి)

వహిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే గతంలో ఉన్న కొందరు ఎక్సైజ్ అధికారులు లిక్కర్ కింగ్‌తో అంటకాగడంతో పెద్దగా కేసులు నమోదు చేయకుండా చూసుకున్నారు. అలాగే వరుస కేసులు నమోదైనా.. పీడీ యాక్టు పెట్టకుండా కాపాడుకున్నారు. అయితే కల్తీ మద్యం తాగిన చాలామంది వ్యక్తుల ఆరోగ్యం ఇప్పటికే గుల్ల కాగా.. కొందరు అస్వస్థకు గురై మృత్యువాత పడుతున్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు అధికారులే దగ్గరుండి మరీ కుటుంబాలతో రాజీ కుదుర్చిన పరిస్థితులు కూడా ఉన్నాయి. ప్రస్తుత కేసులో శాంపిళ్లను అధికారులు పరీక్షల కోసం హైదరాబాద్‌కు తరలించగా.. రిపోర్టు వచ్చిన తర్వాత అసలు విషయం బయటపడే అవకాశం ఉంది.

గతంలో కేసులు ఇలా..

గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం పాతపాలెంలో 2022లో ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి, కల్తీ లిక్కర్ బాటిళ్లను, లేబుళ్లను, స్పిరిట్‌ను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 450 మద్యం సీసాలను పట్టుకోగా.. ముగ్గురిపై కేసు నమోదు చేశారు. కీలక సూత్రధారిని అప్పుడే వదిలేశారు. అదే సంవత్సరంలో కర్ణాటక నుంచి ఆరు క్యాన్లలో స్పిరిట్ రవాణా చేస్తుండగా, అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. అందులో కూడా ఈ లిక్కర్ కింగ్ పాత్ర ఉన్నట్లు అప్పట్లో చర్చ జరిగింది. ఏపీలోని కర్నూలులో స్కార్పియోలో మద్యం తరలిస్తుండగా కేసు నమోదు చేశారు. డ్రైవర్‌ను ఏ1గా చేర్చగా.. లిక్కర్ కింగ్ అందులో ఏ3గా ఉన్నారు. 50 కాటన్ల 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్ల మద్యం అప్పట్లో రికవరీ చేశారు. ధరూర్ మండలంలో కూడా ట్రాక్టర్‌లో ఒరిజినల్ ఛాయిస్, బ్లాక్ మేజిక్ మద్యం పట్టుకున్నారు. అందులో 6,144 ప్యాకెట్లు 180 ఎంఎల్ మద్యం, 5,568 టెట్రా ప్యాకెట్లు 90 ఎంఎల్ మద్యం ఉంది. ఈ ఘటనలోనూ లిక్కర్ కింగ్‌ను ఏ1గా చేర్చారు. 2017 నుంచి లైసెన్స్ లేకుండా కల్లు తయారీ, అందర్ బాహర్ ఆటలు ఆడించడం, నకిలీ లేబుళ్లతో మద్యం కల్తీ చేసి బెల్టుషాపులకు, తాను స్వయంగా పార్టనర్‌గా ఉన్న వైన్స్ షాపులకు తరలించడం ఆయనకు అలవాటు. అయినప్పటికీ.. సీరియల్ అఫెండర్స్ లిస్టులో ఈ లిక్కర్ కింగ్ లేరు. మొత్తం మద్యం అక్రమ రవాణాలో సీరియల్ అ ఫెండర్స్‌గా ఎనిమిది మంది ఉండగా.. అందులో ఇద్దరు కర్ణాటక, ఒకరు తెలంగాణ, ఐదుగురు ఏపీకి చెందిన వారే కావడం విశేషం. గతంతో పోల్చితే మద్యం అమ్మకాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఎక్సైజ్ అధికారులే టార్గెట్ పెట్టి మరీ.. మద్యం విక్రయించాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఈ నేపథ్యంలో నాణ్యమైన మద్యం కల్తీ కాకుండా చూసుకోవాలని అభిప్రాయపడుతున్నారు.

రేపటితో 'సహకార' గడువు పూర్తి

● పాలకవర్గం పొడిగిస్తారా?.. ప్రత్యేక పాలనా?



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

నారాయణపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రైతాంగానికి సేవలు అందిస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సింగిల్ విండో) పాలకవర్గం ఐదేళ్ల పదవి కాలం శుక్రవారంతో ముగియనుంది. దీంతో ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే అవకాశం లేకపోవడంతో ప్రభుత్వం పాత పాలకవర్గం గడువును పెంచుతుందా లేదా ప్రత్యేక అధికారులను నియమిస్తుందా? అన్నదానిపై చర్చ జరుగుతుంది. స్థానిక సంస్థాగత ఎన్నికల అనంతరం విండో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు చేసే అవకాశం ఉంది. గతంలో ఆరు నెలల పాటు పాలకవర్గాలను ప్రభుత్వం పొడిగించిన విషయాన్ని విండో చైర్మన్‌లు గుర్తు చేస్తున్నారు. ఇదే తరహాల్లో గడువు పొడిగించాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పది సహకార సంఘాలకు 130 డైరెక్టర్ స్థానాలు ఉన్నాయి. గత ఎన్నికల సమయంలో జిల్లా వ్యాప్తంగా 31,225 మంది ఓటర్లు ఉన్నారు. ఒక్కో సంఘానికి చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నికతో పాటు 13 మంది డైరెక్టర్లు ఉంటారు. జిల్లాలో మాగనూర్, మక్తల్, ఊట్కూర్, ధన్వాడ, నారాయణపేట, దామరగిద్ద, దంగన్‌పూర్, కోస్గి, నర్వ, తీలేర్ సహకార సంఘాలు ఉన్నాయి. విండో చైర్మన్‌ల విషయానికి వస్తే నర్వ విండో చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డిపై ఏడాది క్రితం అవిశ్వాసంతో తొలగించడంతో ప్రస్తుతం శ్రీనివాస్‌రెడ్డి కొనసాగుతున్నారు. దంగన్‌పూర్ విండో చైర్మన్ జగదీశ్‌పై అవిశ్వాసం పెట్టడంతో ప్రస్తుతం నర్సింహ కొనసాగుతున్నారు.

పీఏసీఎస్ అధ్యక్షుల పదవీకాలం పూర్తి

పాలమూరు (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక సహకార సంఘం (పీఏసీఎస్) అధ్యక్షుల పదవీ కాలం పూర్తయిందని డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి ప్రకటించారు. బుధవారం డీసీసీబీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశం, పీఏసీఎస్‌ల అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవీకాలం పూర్తవటంతో అధ్యక్షులు, చైర్మన్, డైరెక్టర్లను సన్మానించారు. ఎన్నికలు నిర్వహించే వరకు ఉన్న కమిటీనే కొనసాగేందుకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు.



ఆలయం వద్ద భక్తుల రద్దీ



వేంకటేశ్వరుడి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

జన జాతర

(5వ పేజీ తరువాయి)

ఎద్దుల బండ్లపై తరలొచ్చారు. కొండపైకి చేరుకొని, శిబిరాలు ఏర్పాటు చేసుకున్నారు. స్వామివారికి దాసంగాలు సమర్పించారు. అనంతరం స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. కొండ దిగువన ప్రధాన రహదారి నుంచి మెట్లమార్గం వరకు, మరోవైపు ఘాట్ రోడ్డు కమాన్ వరకు ఇరువైపులా రద్దీ ఉండటంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రథోత్సవం బుధవారం అర్ధరాత్రి ప్రారంభమై, గురువారం తెల్లవారు జాము వరకు కొనసాగింది.

కల్యాణకట్ట, కోనేరు వద్ద రద్దీ

భక్తులు మొక్కులు తీర్చుకునే క్రమంలో కల్యాణకట్ట వద్ద తలనీలాలు సమర్పించి, అనంతరం కోనేటిలో స్నానాలు ఆచరించారు. అనంతరం దైవదర్శనానికి వెళ్లారు. ఈ క్రమంలో కల్యాణకట్ట వద్ద, కోనేరు వద్ద తెల్లవారుజాము నుంచే భారీగా రద్దీ నెలకొంది. రద్దీని తట్టుకునే నిమిత్తం షవర్లు, ట్యాప్‌లు ఏర్పాటు చేశారు. అయినా భక్తుల రద్దీకి సరిపోలేదు.

అడుగడుగునా పోలీసులు

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అడుగడుగునా పోలీసులు సేవలందించారు. మన్యంకొండకు మినీ ఆర్టీసీ, వీవీఐపీ వాహనాలు తప్ప మిగతావి రాకుండా గేట్లను ఏర్పాటు చేశారు. వివిధ డిపోల నుంచి వచ్చే బస్సులకు అమ్మవారి దేవస్థాన ఆవరణలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి భక్తులు కొండపైకి మినీ బస్సులలో వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. తేరు మైదానంలో మినీ బస్సులతో పాటు వీవీఐపీ వాహనాలకు ప్రత్యేక పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. దర్శనం అనంతరం లడ్డూ ప్రసాదాలను కొనుగోలు చేసేందుకు తేరు మైదానంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. జాతరలో దొంగలు పోకిరిలు, ఆకతాయిలను గుర్తించడానికి అడుగడునా సీసీ కెమెరాలను బిగించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఎస్పీ జానకి, డీఎస్పీ వేంటేశ్వర్లు పర్యవేక్షించారు. భక్తులు క్యూలైన్లో వేచి ఉండకుండా ఒక డీఎస్పీ, సీఐని గర్భగుడిలో ఉంచి భక్తులను స్వామి దర్శనం అనంతరం వెంటనే బయటకు పంపించారు.

భక్తులకు అన్నదానం

భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ట్రస్ట్ సహకారంతో అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త ఆలహరి మధుసూదన్‌కుమార్, ఏసీ శ్రీనివాసరాజు, కాగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి,ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్, పాలమురు సాయిసేవ సంస్థతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు వలంటీర్లుగా భక్తులకు సేవలందించారు. హెల్త్, ఫైర్ శాఖల ఆధ్వర్యంలో అత్యవసరా విభాగాలను ఏర్పాటు చేశారు.

దుకాణాలు కళకళ

కొండపైన తేరుమైదానం వద్ద, దిగువన ప్రధాన రోడ్డు నుంచి ఘాట్ రోడ్డు వరకు ఇరువైపులా ఏర్పాటు చేసిన మిఠాయి, ఆట బొమ్మలు, అలంకరణ సామగ్రి తదితర దుకాణాలు కొనుగోళ్లతో కళకళలాడాయి. రంగులరాట్నం వద్ద చిన్నారులు సందడి చేశారు.



జాతరలో వెలిసిన మిఠాయి దుకాణాలు





స్వామికి దాసంగాలతో నైవేద్యం పెడుతున్న భక్తులు, బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ జానకి



మెట్లు ఎక్కేందుకు వృద్ధురాలికి సహాయం చేస్తున్న ఓ ఎస్ఐ



పార్కింగ్ స్థలంలో నిలిపిన వాహనాలు



గుట్టపైకి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న భక్తులు

స్పోర్ట్స్ బాక్స్

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

» కబడ్డీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి గౌడ్



క్రీడాకారులతో కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, వైస్ ప్రెసిడెంట్ దామోదర్‌గౌడ్ తదితరులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ అన్నారు. వికారాబాద్ జిల్లాలో ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ కబడ్డీ టోర్నీ నిర్వహించనున్నారు. ఈ టోర్నీలో పాల్గొనే జిల్లా బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలను బుధవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని స్టేడియం మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవ లేదని, జిల్లా నుంచి ఎంతో మంది జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారని గుర్తు చేశారు. కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రాబబుల్స్‌కు క్రీడాకారులను ఎంపిక చేశామని, శిక్షణ శిబిరం నిర్వహించి తుది జట్టును ఎంపిక చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ దామోదర్‌రెడ్డి, యూ. శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలరాజు, పాపారాయుడు, గణేశ్, శ్రీనివాసులు, అనురాధ పాల్గొన్నారు.

రేపు జోగుళాంబ గద్వాల జిల్లా జట్ల ఎంపిక

గద్వాల అర్బన్ : కబడ్డీ సబ్ జూనియర్ పురుషులు, మహిళల జిల్లా జట్ల ఎంపిక పోటీలను ఈనెల 14న నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డీకే స్నిగ్ధారెడ్డి, కార్యదర్శి ఎం.నర్సింహులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 14న ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 20 నుంచి 23 వరకు వికారాబాద్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌కు అర్హులవుతారని తెలిపారు. పోటీలకు హాజరయ్యే పురుషులు 55 కిలోలు, మహిళలు 50 కిలోల బరువు మించకుండా ఉండాలని సూచించారు. 2009, ఏప్రిల్ ఒకటి తర్వాత పుట్టిన వారు పోటీలకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు పేర్లను నమోదు చేసుకునేందుకు ఆధార్‌కార్డు, ఎస్ఎస్‌సీ మెమోలను తప్పని సరిగా తీసుకురావాలని సూచించారు.

నేడు అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ పట్టణంలోని స్టేడియం మైదానంలో ఈనెల 13న అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శరత్‌చంద్ర, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆనంద్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో అండర్-14, 16, 18, 20 సంవత్సరాల లోపు బాల, బాలికల జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 18, 19వ తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అంతర్‌జిల్లాల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు మధ్యాహ్నం 2 గంటలకు స్టేడియం మైదానానికి చేరుకోవాలని సూచించారు. జనన ధ్రువపత్రం, ఆధార్ కార్డులతో కోచ్ సునీల్‌కు రిపోర్ట్ చేయాలని కోరారు.

క్రైం కార్నర్

బొలెరో వాహనం బోల్తా

» పలువురికి తీవ్ర గాయాలు

» జములమ్మ దర్శనానికి వెళ్తుండగా ప్రమాదం

కేటీదొడ్డి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : బొలెరో వాహనం బోల్తా పడి పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, కేటీదొడ్డి మండల కేంద్రంలో బుధవారం ఈ సంఘటన జరిగింది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం, రాయచూరు జిల్లాలోని బాపురం గ్రామానికి చెందిన దాదాపు 20 మంది భక్తులు జోగుళాంబ గద్వాల జిల్లాలోని జములమ్మ ఆలయ దర్శనానికి బయలు దేరారు. కేటీదొడ్డి మండల కేంద్రంలోని శివాలయం సమీపంలో వాహనం పట్టీలు విరిగిపోవడంతో అది బోల్తా పడింది. సమీపంలో ఉన్న శివస్వాములు, పొలాల దగ్గర ఉన్న రైతులు వెంటనే అక్కడికి చేరుకొని బోల్తా పడిన వాహనాన్ని నిలబెట్టి భక్తులను బయటకు తీసుకొచ్చారు. అంబులెన్స్‌కు, పోలీసులకు సమాచారం అందించారు. అంబులెన్స్ వచ్చేలోపే తీవ్రంగా గాయపడిన కొందరిని మరో వాహనంలో రాయచూరులోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అంబులెన్స్ వచ్చిన తర్వాత మిగిలిన బాధితులను ఆసుపత్రికి తీసుకెళ్లారు.

లారీ క్యాబిన్‌లో చెలరేగిన మంటలు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జడ్చర్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల నుంచి గంగాపురం వెళ్లే దారిలోని స్నేహ పౌల్ట్రీ దాణా తయారీ పరిశ్రమ వద్ద నిలిపి ఉన్న లారీ క్యాబిన్‌లో మంటలు చెలరేగాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం మొక్కజొన్నల లోడ్‌తో ఉన్న లారీని పరిశ్రమ ముందు నిలిపారు. లారీ క్యాబిన్‌లోని గ్యాస్ స్టవ్‌కు అమర్చిన సిలిండర్‌ను డ్రైవర్ ఆన్ చేసి మరిచిపోయాడు. దీంతో క్యాబిన్ మొత్తం గ్యాస్‌తో నిండిపోయింది. అదే సమయంలో వంట చేసుకునేందుకు స్టవ్‌ను వెలిగించడంతో క్యాబిన్‌లో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు వెంటనే జడ్చర్ల ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ రాజేందర్, లీడింగ్ ఫైర్‌మెన్ లక్ష్మీకాంత్‌రెడ్డి, సిబ్బంది రాజేశ్, పవన్‌కుమార్, అంజనేయులు, ప్రేమ్‌కుమార్, ఆపరేటర్ వెంకటేశ్‌లు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఏ మాత్రం ఆలస్యమైనా లారీ డీజిల్ ట్యాంకుకు మంటలు అంటుకొని పెద్ద ప్రమాదం జరిగేదని స్థానికులు తెలిపారు. డ్రైవర్ అజాగ్రత్త వల్లే ఈ ప్రమాదం జరిగిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

జడ్చర్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలం, వల్లూరు గ్రామ సమీపంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఎస్ఐ మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రం, నువపాడు జిల్లా, కామ్నాతాలుక, కంటితరా గ్రామానికి చెందిన గణేశ్ సాబెర్ (33) మూడు రోజుల క్రితం జీవనోపాధి కోసం జడ్చర్ల ప్రాంతానికి వచ్చాడు. సోదరుడు రవివార్‌సాబెర్ వద్ద ఉంటూ పనుల కోసం వెదుక్కుంటున్నాడు. అందుకోసం మంగళవారం రాత్రి వల్లూరు సమీపంలోని ఇటుకబట్టి వద్దకు వెళ్లాడు. రాత్రంతా అక్కడే ఉన్న అతడు బుధవారం ఉదయం చూసే సరికి మృతి చెంది ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.



జములమ్మ ఆలయ ఆవరణలో కిక్కిరిసిన భక్తులు



అమ్మవారికి పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు

చల్లంగ చూడమ్మా.. జములమ్మ తల్లీ

» భక్తి శ్రద్ధలతో పౌర్ణమి వేడుకలు » పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే దంపతులు

» అమ్మవారిని దర్శించుకున్న 50 వేల మంది భక్తులు



ప్రత్యేక అలంకరణలో జములమ్మ

గద్వాల ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : నిండు పౌర్ణమి నాడు జములమ్మ దేవత ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని జమ్మిచేడు జములమ్మ ఆలయంలో బుధవారం పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున మూడు గంటలకు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు కృష్ణానదికి వెళ్లారు. 108 కలశాలతో నదీ జలాన్ని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి అమ్మవారికి భక్తి శ్రద్ధలతో అభిషేకం చేశారు. నాలుగు గంటల సమయంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, బండ్ల జ్యోతి దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలను తీసుకురాగా, వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆ వస్త్రాలతో అర్చకులు అమ్మవారిని అలంకరించగా, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ వెంకట్రాములు, ఈవో పురేందర్‌కుమార్‌లు వారిని సత్కరించి తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం భక్తుల దర్శనానికి అవకాశం కల్పించారు. జములమ్మ తల్లీ కరుణించవమ్మా అంటూ భక్తులు అమ్మవారికి పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. బైనోళ్ల సవ్వడి, డప్పు వాయిద్యాలు, మహిళల పూనకాలతో ఆలయ పరిసర ప్రాంతాలు మారుమోగాయి. మన రాష్ట్రంతో పాటు ఏపీ, కర్ణాటక ప్రాంతాల నుంచి తరలివచ్చిన 50 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ చైర్మన్, ఈవోలు తెలిపారు.

వైభవంగా పల్లకీ సేవ

పౌర్ణమి వేడుకల్లో భాగంగా సాయంత్రం అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించారు. భక్త జన సందోహం మధ్య ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి, ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేయించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్లు మధుమతి, రాధారెడ్డి, మంగలి వీరేశ్, వెంకటేశ్, బాబు, కురువ ముసిలన్న, అక్కల శ్రీనివాసులు, రాజు, బైని నాగరాజు, తూము కృష్ణ, మల్లేశ్, చంద్రశేఖర్, ఉద్యోగులు మురళీధర్‌రెడ్డి, రవిప్రకాష్, రాజలింగం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు ప్రజలపై ఆర్థిక భారం

» కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయిన మునిసిపాలిటీ

» మ్యుటేషన్ ఫీజు రూ.1000 నుంచి రూ.3 వేలకు పెంపు

» ఆస్తి పన్నులు కూడా పెరిగే పరిస్థితి



మహబూబ్‌నగర్ పట్టణ ముఖచిత్రం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు పురపాలిక కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ కావడంతో పట్టణం అభివృద్ధి చెందడంతో పాటు, ప్రజలకు మెరుగైన సేవలు అందనున్నాయి. దీంతో పాటు ప్రజలపై ఆర్థిక భారం కూడా పడనుంది. కార్పొరేషన్‌లో విలీనమైన రెండు గ్రామాల ప్రజలు తమపై పన్నుల భారం పెరుగుతుందని ఆందోళన చెందుతుండగా నగర పాలక సంస్థ ప్రజలకూ ఆర్థిక భారం తప్పడం లేదు. మ్యుటేషన్ ఫీజు ఏకంగా 200 శాతం పెరిగింది. ఇదివరకు పురపాలిక పరిధిలో మ్యుటేషన్ చేసుకుంటే రూ.1000 ఫీజు ఉండేది. కార్పొరేషన్‌గా మారడంతో ఇప్పుడు రూ.3000కు చేరింది. ఈ నెల 10వ తేదీ నుంచే పెరిగిన ఫీజులు అమలులోకి వచ్చాయి. దీంతో ప్లాట్లు, ఇళ్లు, అపార్ట్‌మెంట్ ప్లాట్లు మ్యుటేషన్ చేసుకుంటే రూ.3000 చెల్లించాల్సి ఉంటుంది. పాలమూరు రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలో నగరానికి చెందిన మ్యుటేషన్‌లు ప్రతీ రోజు సగటున 20 నుంచి 25 వరకు జరుగుతాయి. ఈ లెక్కన ప్రతీ నెల నగర ప్రజలపై రూ.10 లక్షల నుంచి రూ. 12 లక్షల భారం పడనుంది. రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువలు మాత్రం పెరగలేదు. అదే విధంగా కార్పొరేషన్‌కు ప్రధాన ఆదాయ వనరయిన ఆస్తిపన్ను కూడా పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో నెలలో ముగియనుండటంతో, వచ్చే ఆర్థిక సంవత్సరంలో పన్నులు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇంటి అనుమతుల ఫీజు కూడా పెరగనుంది. ప్రస్తుతం ఆస్తి పన్ను రూపంలో నగర సంస్థకు ఏటా రూ.20 కోట్లు ఆదాయం వస్తోంది. అధికారులు పారదర్శకంగా అన్ని నిర్మాణాలకు కొలతలు తీసి పన్నులు విధిస్తే ఈ ఆదాయం డబుల్ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే చాలా ఇళ్లు, కమర్షియల్ భవనాలు ఆస్తి పన్నులు లేకుండానే నడుస్తున్నాయి. కొన్ని పెద్ద భవనాలకు ఎస్ఎఫ్‌టీ తగ్గించి ఇవ్వడంతో తక్కువ పన్నులు వస్తున్నాయి. వీటన్నింటినీ సరిచేస్తే ఆస్తి పన్ను రూపంలోనే రూ.40 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

కాగా ఇప్పటివరకు నగరంలో ఎలాంటి పన్నులు పెరగలేదని, అలాంటి మార్గదర్శకాలేమీ తమకు రాలేదని నగర పాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆర్థిక సంవత్సరం ముగియనుండటం, ఇప్పటికే చాలా మంది పన్నులు చెల్లించడంతో, వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పెరిగితే పెరగవచ్చని తెలుస్తోంది.

పేద కుటుంబాలు బాగుండాలి

» కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి » గృహ ప్రవేశం చేసిన 240 మంది లబ్ధిదారులు



లబ్ధిదారుకు ఇంటి తాళం చెవిని అందిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : పేద కుటుంబాలు అన్ని రకాలుగా బాగుండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజా సంక్షేమమే తమ ధ్యేయమని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో 240 మంది డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు బుధవారం సాయంత్రం గృహ ప్రవేశం చేశారు. ముందుగా ఎమ్మెల్యే వారికి ఇంటి తాళం చెవులు, పట్టాలను అందించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్సీగా ఉన్నప్పుడే కల్వకుర్తిలో 240 డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి రూ. 13 కోట్లు మంజూరు చేయించానని తెలిపారు. కానీ గత పాలకుల నిర్లక్ష్యంతో పనులు అసంపూర్తిగా మిగిలాయని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే 2.50కోట్లు మంజూరు చేసి, అసంపూర్తి పనులను పూర్తి చేయించినట్లు చెప్పారు. డబుల్‌బెడ్రూం ఇళ్లల్లో విద్యుత్ మీటర్లను వెంటనే ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో డ్రైనేజీలు, సీసీ, బీటీ రోడ్ల నిర్మాణానికి ఇప్పటికే రూ. 500 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. అనంతరం మార్చాల గ్రామంలో బీటీ రోడ్డు నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాకూర్ బాలాజీసింగ్, తహసీల్దార్ ఇబ్రహీం, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సంజు కుమార్, నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, యెన్నం భూపతిరెడ్డి, పసుల రాజేశ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాని, ఎజాస్, రవి, రేష్మ, శ్రీనివాసులు, శేఖర్, శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం

పెంట్లవెల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, పెంట్లవెల్లి మండల కేంద్రంలో వేంకటేశ్వర స్వామి రథోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలలతో పాటు రాయలసీమ ప్రాంతం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ముందుగా ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రథానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకుల మంత్రోచ్చారణ మధ్య రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గోవిందా.. గోవిందా.. అంటూ భక్తుల నామ స్మరణతో పెంట్లవెల్లి మార్మోగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ రామన్‌గౌడ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జంగం జీవన్‌కుమార్, నాయకులు రాజేశ్, రామన్‌గౌడ్, ఎండీ కబీర్, సురేందర్‌గౌడ్, ఆర్.వెంకటస్వామి, ఎర్రశ్రీను, మోహన్, ఖాజామైనుద్దీన్ పాల్గొన్నారు.



రథం ముందు కోలాటం ఆడుతున్న యువకులు

అధికారికంగా సంత్ సేవాలాల్ జయంతి

» కేంద్ర మంత్రికి తెలంగాణ ఎంపీల వినతి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : బంజారాలు గురువుగా భావించి పూజించే సంత్ సేవాలాల్ జయంతిని దేశ వ్యాప్తంగా అధికారికంగా నిర్వహించాలని భారతీయ జనతాపార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ కోరారు. ఈ విషయంపై ఆమెతో పాటు రాష్ట్రానికి చెందిన ఎంపీలు బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 15న సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను దేశవ్యాప్తంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సంత్‌సేవాలాల్ చేసిన సేవలను దేశ ప్రజలు, జనాభాలో ఏడు శాతం ఉన్న లంబాడీలు, వారి చరిత్రను తెలుసుకునేందుకు ఈ ఉత్సవాలు దోహదపడతాయని తెలిపారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు రఘునందన్ రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గడ్డం నాగేశ్, మాజీ ఎంపీ సీతారామ్ నాయక్, బీజేపీ ఎస్టీ మోర్చా నాయకులు తదితరులు ఉన్నారు.



కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు వినతిపత్రం ఇస్తున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

పునరావాసం ప్యాకేజీ చెల్లించాలి

» ఉదండాపూర్ రిజర్వాయర్ వద్ద నిర్వాసితుల ఆందోళన



ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

జడ్చర్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించినట్లుగా పునరావాసం ప్యాకేజీని పెంచి, వెంటనే చెల్లించాలని ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులు ఆందోళన చేపట్టారు. పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఈ రిజర్వాయర్‌లో వల్లూరు, ఉదండాపూర్ గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. ఆయా గ్రామాల నిర్వాసితులు బుధవారం రిజర్వాయర్ వద్దకు చేరుకొని పనులను అడ్డుకున్నారు. రిజర్వాయర్ కట్టపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు నెలల క్రితం నిర్వహించిన సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించిన విధంగా ప్యాకేజీ చెల్లించాలని కోరారు. పునరావాసం ప్యాకేజీని రూ. 25 లక్షలకు పెంచుతామని, మిగిలిన పరిహారం కూడా చెల్లిస్తామని ఆయన ప్రకటించినట్లు గుర్తు చేశారు. ఆరు నెలల్లో చెల్లింపులు పూర్తి చేస్తామన్నారని తెలిపారు. ఈ మేరకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో నిర్వాసితులు హన్మంతు, శ్రీనివాసులుతో పాటు దాదాపు 30 మంది పాల్గొన్నారు.

36 వేల కోళ్లు వెనక్కి..

» పుల్లూరు టోల్ ప్లాజా వద్ద కొనసాగుతున్న తనిఖీలు

అలంపూరు చౌరస్తా, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఏవీఎస్ ఇన్‌ఫ్లూయెంజా వైరస్ వ్యాప్తి నివారణకు ఏపీ, తెలంగాణ సరిహద్దులోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద కోళ్ల వాహనాల తనిఖీలు కొనసాగుతున్నాయి. పశువైద్యాధికారి ఎల్లికంటి మల్లేశ్ ఆధ్వర్యంలో బుధవారం తనిఖీలు చేపట్టారు. బెంగళూరు, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి రాష్ట్రానికి వాహనాల్లో తీసుకొస్తున్న 36 వేల బ్రాయిలర్ కోళ్లను వెనక్కి పంపించారు. ఈ సందర్భంగా అలంపూరు సీఐ రవిబాబు చెక్ పోస్టును పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. కోళ్లను తరలించే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. తనిఖీల్లో సిబ్బంది రమణమ్మ, కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

పోలింగ్ కేంద్రాల ముసాయిదా సిద్ధం

- బ్రహ్మచారి, ఎంపీడీవో, వంగూరు



వంగూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండల, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికల నిర్వహణలో భాగంగా మండలంలో ముసాయిదా ఓటర్ల జాబితాను, వాటికి సంబంధించిన పోలింగ్ కేంద్రాల ముసాయిదాలను సిద్ధం చేసినట్లు ఎంపీడీవో బ్రహ్మచారి తెలిపారు. ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

ఓటర్ల, పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ఎప్పుడు వెలువరిస్తారు ?

ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితాకు సంబంధించి అభ్యంతరాలు ఉంటే ఈ నెల 11 నుంచి 13 వరకు వాటిని స్వీకరించి 14న పరిష్కరిస్తారు. 15న పోలింగ్ కేంద్రాల తుది జాబితాను వెలువరిస్తాం

మండలంలో ఎంపీటీసీ స్థానాలు ఎన్ని, ఓటర్లు ఎంత మంది ?

మండలంలోని 10 ఎంపీటీసీ స్థానాలలో మొత్తం ఓటర్ల సంఖ్య 33,589 మంది. పురుషులు-16,539, స్త్రీలు- 17,050 మంది ఓటర్లు ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లకు సిద్ధం చేసుకుంటున్నాం.

న్యూస్ బాక్స్

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు

చారకొండ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చారకొండ, మర్రిపల్లి, తిమ్మాయిపల్లి, రామచంద్రాపురం గ్రామాల్లో బుధవారం జాతీయ ఉపాధిహామీ పథకం పనులపై గ్రామసభలు నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందం పర్యవేక్షించి నిధుల అక్రమాలపై గుర్తిస్తున్నారు. ఈసందర్భంగా ఏపీవో లక్ష్మయ్య మాట్లాడుతూ మండలంలో 2023 ఏప్రిల్ నుండి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధిహామీ పనులపై ఆడిట్ చేస్తున్నామని అన్నారు. మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో ఆడిట్ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో మండల స్థాయి సామాజిక తనిఖీ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీటీ విద్యాధరరెడ్డి, ఆడిట్ బృందం, ఉపాధి హామీ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదవాలి

బిజినేపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇష్టపడి చదివితేనే అనుకున్న లక్ష్యాని సాధించి ఉన్నత స్థాయికి ఎదుగుతారని మాజీ సర్పంచ్ అవంతి శంకర్ విద్యార్థులకు ప్రేరణ కల్పించారు. మండలంలోని శాయిన్‌పల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 360 మందికి సంకల్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేసి మాట్లాడారు. సంకల్ప ఫౌండేషన్ వ్యవస్థాపకులు పెద్దబూల సతీష్ గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు బ్యాగ్‌లను అందించడం సంతోషకరమని అభిప్రాయపడ్డారు. సమాజంలో ధనికులు ఎంతో మంది ఉన్నా పది మందికి ఉపయోగపడాలనే దాతృత్వ గుణం కొందరికే ఉంటుందని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ యువకులు వి.శివరాం, బి.కురుమయ్య, లక్ష్మీనారాయణ, బి.సూరి, శంకర్, నిరంజన్, రాముడు, నాగరాజు, రాము, యాదయ్య, పాండు, జంత్రునాయక్ ఉన్నారు.

రుణాలు మంజూరు చేయాలి

పదర, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అధికారులు నిర్లక్ష్యం వీడి లబ్ధిదారులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు అన్నారు. ఆయన బుధవారం మండల కేంద్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ముందు బీజేపీ మండల అధ్యక్షుడు కొయ్యల మల్లేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో కులవృత్తుల వారి ఆర్థిక ఎదుగుదల కోసం ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం రూపొందించారని గుర్తు చేశారు. కానీ, కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా అందాల్సిన పేదలకు పథకాలు అందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బ్యాంక్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేష్, రవి, పరమేష్, అంజి, బాలకోటి, కాట్రాజ్ అంజి, విజయ కుమారి, గోవిందమ్మ, లక్ష్మమ్మ ఉన్నారు.

పోలింగ్ స్టేషన్ల జాబితా అభ్యంతరాలపై నేడు సమావేశం

కల్వకుర్తి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్ల జాబితా అభ్యంతరాలపై గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకట్రాములు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల స్థానిక అధ్యక్షులు, ఉపాధ్యక్షులు హాజరై తమ అభ్యంతరాలు, సూచనలు తెలియజేయాలని ఎంపీడీవో వెంకట్రాములు కోరారు.

మండల స్థాయి క్విజ్ పోటీలు

తెలకపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గడ్డంపల్లిలో వండర్స్ థాట్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి ఎంపీహెచ్ఎస్, గడ్డంపల్లి ద్వితీయ బహుమతి ఎంజేపీటీబీహెచ్ఎస్ తెలకపల్లి టీంలు గెలుపొందాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ నాయకులు వెంకటస్వామి, ఏ.ప్రకాశ్, శంకర్‌రెడ్డి, శివకాశి, వండర్స్ థాట్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో తండాలకు మహర్దశ

- ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి

బిజినేపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన ప్రభుత్వంలో గిరిజన తండాల అభివృద్ధికి పెద్దపీట వేయడంతో మహర్దశ వచ్చిందని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఊడుగులకుంట తండా నుంచి మంగనూర్ వరకు షెడ్యూల్డ్ తెగల ఎస్‌డీఎఫ్ నిధులు రూ.3.73 కోట్ల నిధులతో బీటీ రోడ్డు పనులకు బుధవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రతీ ఆవాసానికి బీటీ రోడ్డు వేసి రవాణా అవస్థలు లేకుండా చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రాబోయే రోజుల్లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీ గెలిపించి ముఖ్యమంత్రికి బహుమతి ఇవ్వాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిద్దె రాములు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వెంకటస్వామి, మాజీ సర్పంచులు అమృత్‌రెడ్డి, తిరుపతయ్య, కాట్రావత్ చందులాల్, పాండు నాయక్, హరీశ్వర్‌రెడ్డి, చంద్రగౌడ్, మాన్యనాయక్, రాంచందర్, మోహన్‌రెడ్డి, మల్లేష్ యాదవ్, బాలపీరు, నగేష్, కత్తె ఈశ్వర్, వాల్యానాయక్, గోవింద్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, పూల్యానాయక్, కృష్ణానాయక్, వెంకటస్వామి, సైదులు, లక్ష్మయ్య గౌడ్, తిరుపతి రెడ్డి ఉన్నారు.



ఊడుగుల కుంట తండాలో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసి తండావాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

తండాల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

తిమ్మాజిపేట : కాంగ్రెస్ ప్రభుత్వంలో తండాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నదని స్థానిక ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. మండలం లోని బుద్ద నాయక్ తండాకు రూ.76లక్షల 50వేలతో మంజూరైన రోడ్డుకు భూమి పూజచేశారు. లక్ష్మీనాయక్ తండా నుంచి తువ్వబండ తండా, గొరిట తండా నుంచి ఎర్రబిక్యతండాకు 70లక్షలు మంజూరు కాగా పుల్లగిరి రోడ్డు నుంచి బోరుగడ్డతండాకు 43లక్షల 50వేలు అదే విధంగా చెన్నాగులతండా కు 42లక్షల 50వేలు మంజూరు కాగా ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌బహదూర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాధవులు, నాయకులు దానం బాలరాజు, రవూఫ్, హర్షవర్ధన్‌రెడ్డి, లక్ష్మీనారా యణ, నాగసాయిలు, ముబారక్, వెంకటయ్య, అనంతాచారి, మల్లేష్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పరు ప్లాట్‌కు సాగునీరు తీసుకొస్తా

- సీసీ రోడ్డు పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



ఎల్మపల్లి గ్రామంలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అమ్రాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : నల్లమల లోతట్టు అటవీ ప్రాంతంలోని అప్పర్ ప్లాట్ ప్రాంతంలో రైతులు ఎదురుచూస్తున్న వ్యవసాయానికి సాగునీరు అందించే కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన అమ్రాబాద్‌లో రోడ్డు విస్తరణ పనులతో పాటు మాధవన్‌పల్లి, కల్ములోనిపల్లి, ఎల్మపల్లి, చింతలోనిపల్లి తదితర గ్రామాలలో సుమారు రూ. 5 కోట్లతో నిర్మించనున్న సీసీరోడ్ల పనులకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి కృష్ణానదిపై మద్దిమడుగు వద్ద బ్రిడ్జి నిర్మాణంతో పాటు నల్లమలలో పర్యాటక అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, అమ్రాబాద్ సింగిల్‌విండో చైర్మన్ గణేష్, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమి టీ వైస్‌చైర్మన్ ఆర్ వెంకటయ్య, కాంగ్రెస్ మం డల అధ్యక్షుడు హరినారాయణగౌడ్, కాంగ్రెస్ నాయకులు నాసరయ్య, మల్లికార్జున్, రాజగో పాల్, లింగం, ముక్రంఖాన్, బాల్‌లింగంగౌడ్ తిరుపయ్య, కృష్ణయ్యగౌడ్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలో కనీస మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. వెల్దండ నుండి పోతేపల్లి మీదుగా జూపల్లి వరకు రూ. 11 కోట్లు, వెల్దండ నుంచి రాచూరు వరకు రూ. 5.20 కోట్లు, వెల్దండ నుంచి కంటోనిపల్లి వరకు రూ. 4.50 కోట్లతో చేపట్టే బీటీ రోడ్ల నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్, పీఏసీఎస్ డైరెక్టర్లు వెంకటయ్యగౌడ్, సంజీవ్‌కుమార్, మార్కెట్ డైరెక్టర్ కేశమళ్ల కృష్ణ, నాయకులు మోతీలాల్, భూపతిరెడ్డి, పర్వత్‌రెడ్డి, రామకృష్ణ, హరికిషన్, రషీద్, శ్రీనుయాదవ్, పుల్లయ్య, కాడురాం, వెంకటయ్య యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌రావు, తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, ఎంపీవో లక్ష్మన్‌నాయక్, అధికారులు ఉన్నారు.



వెల్దండలో బీటీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

16న సగర శంఖారావం

కొల్లాపూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ఈనెల 16న సగర శంఖారావం బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సగర సంఘం నాయకులు పేర్కొన్నారు. బుధవారం కొల్లాపూర్‌లో సగర సంఘం నాయకులు ఇంటింటికీ తిరిగి సగరులను ఆహ్వానిస్తూ వారికి కరపత్రాలను పంపిణీ చేశారు. సగర శంఖారావం సభలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు సగరులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, నాయకులు షక్కెర రామచంద్రయ్య, వేముల కురుమూర్తి, నీరడి ప్రభాకర్ కొనసాగించారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- డీఈవో రమేష్



కోడేరులో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈవో రమేష్

కోడేరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్, జీపీఎస్, సీపీఎస్‌లను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడుతూ వారికి అందుతున్న విద్యాభ్యాసం గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను బ్లాక్‌బోర్డుపై రాయించి వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యార్థులతో తెలుగు, ఇంగ్లిష్ పాఠ్యపుస్తకాలను చదివించారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో భాస్కర్ శర్మ, పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.

నిధులను వినియోగించుకోవాలి

పెద్దకొత్తపల్లి : పాఠశాలలకు విడుదలైన నిధులను అభివృద్ధి పనులకు వినియోగించుకోవాలని డీఈవో రమేష్‌కుమార్ వెల్లడించారు. బుధవారం మండలంలోని చంద్రకల్, పెద్దకొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలను, పెద్దకొత్తపల్లిలో నిర్వహిస్తున్న ఉన్నత పాఠశాలల గణిత, సైన్స్, సోషల్ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను డీఈవో పరిశీలించారు. డీఈవో వెంట సెక్టోరియల్‌అధికారి వెంకటయ్య, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధితునికి మాజీ మంత్రి పరామర్శ



కాంగ్రెస్ మైనార్టీ సెల్ నాయకుడు నిజాముద్దీన్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్

కల్వకుర్తి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన పీసీసీ మైనార్టీ సెల్ నాయకుడు నిజాముద్దీన్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ బుధవారం ఆయనను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు గంగాధర్, లక్ష్మయ్య గౌడ్, బాలరాజు, సత్యం ఉన్నారు.

నల్లమలలో మళ్లీ మంటలు

- ఐదు గంటలు శ్రమించి మంటలు అదుపులోకి తెచ్చిన సిబ్బంది

- అడవికి నిప్పు పెడితే జైలుకే

- డీఆర్‌వో నిరంజన్



బ్లోయర్లతో మంటలు ఆర్పుతున్న ఫైర్ వాచర్లు

దోమలపెంట,ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ ప్రాంతంలో వారం రోజులుగా ఎక్కడో ఒక చోట మంటలు అంటుకుంటున్నాయి. బుధవారం మరోమారు మంటలు చెలరేగాయి. నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట రేంజ్ పరిధిలోని పాతూరుబైలు ప్రాంతంలో మంటలు చెలరేగడంలో పది మంది ఫైర్ వాచర్లు, అటవీశాఖ అధికారులు ఐదు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చినట్లు దోమలపెంట రేంజ్ డీఆర్‌వో నిరంజన్ తెలిపారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో అటవీ ప్రాంతంలో గడ్డి ఏపుగా పెరగడంతో మంటలు అదుపు చేసేందుకు కొంత కష్టంగా ఉన్నప్పటికీ తమ సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని, అటవీ ప్రాంతానికి వెళ్లే పశువులు, మేకల కాపరులు, అటవీ ఉత్పత్తులకు సేకరించే వారు ఉద్దేశ పూర్వకంగా అటవీ నిప్పు పెట్టినట్లు నిర్ధారణ అయితే అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని ఆయన హెచ్చరించారు.

ప్రవాస భారతీయులపై దాడి అమానుషం : డీవైఎఫ్ఐ

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలో అక్రమ వలసదారుల పేరుతో ప్రవాస భారతీయులపై దాడి చేయడం అమానుషమని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి నాగపూర్ మధు అన్నారు. బుధవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. అమెరికాలో అక్రమ వలసదారుల పేరుతో భారతీయుల చేతులకు సంకెళ్లు వేసి దేశానికి తీసుకురావడం అవమానకరమన్నారు. ఈ సంఘటనపై ప్రధాని మోదీ స్పందించకపోవడం దారుణమన్నారు. డీవైఎఫ్ఐ నాయకులు సుల్తాన్, కళ్యాణ్, బద్రీ, మద్దిలేటి, శివ, వినోద్, రాజు పాల్గొన్నారు.

యూనియన్ 75 వసంతాల వేడుకలు



75 వసంతాల వేడుకల్లో విద్యుత్ కార్మికులు

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ కార్మిక సంఘం 1104 యూనియన్ 75 వసంతాల వేడుకలను బుధవారం అచ్చంపేట సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ నిరంతరం కార్మికుల పక్షాన పోరాటాలు చేస్తూ ఎన్నో సమస్యలు పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో కార్మికులు బాలకిష్టయ్య, నాయకులు రాజు, లక్ష్మణ్, చందర్‌లాల్, రఘురాం, శ్రీనివాసులు, చందు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీలను నిలిపివేయాలి

తెలకపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కొద్ది రోజుల నుంచి డిప్యూటేషన్ పేరుతో గ్రామపంచాయతీ కార్యదర్శులను బదిలీ చేస్తున్న విషయంపై బుధవారం జిల్లా స్వేరోస్ నాయకులు ఎంపీడీవో శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. సంబంధిత అధికా రులతో కారణాలను ఆరా తీశారు. అనంతరం స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్ మాట్లాడుతూ బలవంతంగా పంచాయతీ కార్యదర్శులను డిప్యూటేషన్ పేరుతో బదిలీ చేసి స్థానిక ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డికి సానుకూలంగా ఉన్న పంచాయతీ కార్యదర్శులను వివిధ గ్రామాలకు కేటాయిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ బదిలీల వెనకాల రాజకీయ కుట్రదాగిఉందని, రానున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామ పంచాయతీలను ఏకగ్రీవం చేయడానికే పంచాయతీ కార్యదర్శులను డిప్యూటేషన్ పేరుతో బదిలీ చేస్తున్నారని తెలియజేశారు. వెంటనే పంచాయతీ కార్యదర్శుల బదిలీ లను నిలిపివేసి యథావిధిగా పంచాయతీ కార్య దర్శులను వారి స్థానంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. జిల్లా జాయింట్ సెక్రటరీ మిద్దె ధర్మరాజు, జిల్లా సోషల్ మీడియా కమాండర్ సంపత్ కుమార్, బొల్లె శివ, బాలకృష్ణ ఉన్నారు.

ఆటో, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

వంగూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని డిండిచింతపల్లి, ఉమ్మాపూర్ సమీపంలోని రోడ్డుపై బుధవారం ఆటో, బైక్ ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే... డిండిచింతపల్లికి చెందిన దుర్గం సత్యనారాయణగౌడ్, ఉమ్మాపూర్‌కు చెందిన సలెయ్యలు బైక్‌పై డిండిచింతపల్లి వైపు వెళ్తుండగా ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణగౌడ్, సలెయ్యలకు తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 అంబులెన్సులో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. సత్యనారాయణగౌడ్ పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి



మునిసిపల్ కమిషనర్‌ను సన్మానించిన సిబ్బంది

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కాలనీలలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని మునిసిపల్ కమీషనర్ యాదయ్య అన్నారు. అచ్చంపేట మునిసిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లకు ఏర్పాటు చేసిన సందర్భంగాఆయన మాట్లాడారు. కాలనీలలో సిబ్బంది ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పై దృష్టిపెట్టాలన్నారు. కాలనీలలో ఉన్న ప్రధాన సమస్యలు తమ దృష్టికి తీసుకు రావాలని పరిష్కరించేందుకు కృషి చేస్తా మన్నారు. అనంతరం కౌన్సిలర్లు ఆయనను సన్మానించారు. సిబ్బంది తిరుపతయ్య, నిరంజన్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిహారం పెంచి ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

- సీపీఎం మండల కార్యదర్శి బాలస్వామి



రిలే నిరాహార దీక్షలు చేపట్టిన బైపాస్ రోడ్డు నిర్వాసితులు

చారకొండ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారి 167లో భాగంగా మండల కేంద్రంలో నిర్మాణం చేపడుతున్న బైపాస్ రోడ్డులో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం పెంచి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి బండపల్లి బాల స్వామి కోరారు. మండల కేంద్రంలోని చెర్కు. పల్లి చౌరస్తాలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి ఇళ్లు కట్టుకొని ఇక్కడే బతుకుతున్న 29 మంది పేదల ఇళ్లను బైపాస్ రోడ్డుకు అడ్డు వస్తున్నాయని అధికారులు నేలమట్టం చేశారని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి నిర్వాసితులకు ఇంటి జాగతో పాటు ఇళ్లు నిర్మించి, పరిహారం రూ. 50 లక్షలు పెంచి ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సందూరి చిట్టెమ్మ, అలివేల, విజయ, వెంకటమ్మ, లాలమ్మ, బాల్‌నారి, లింగమయ్య, నల్ల కిరణ్ పాల్గొన్నారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో శివ స్వాములకు అన్నదానం

కొల్లాపూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మండల పరిధిలోని అటవీ రేంజ్ పరిధిలో ఉన్న నల్లమల గ్రామాల్లో ఉన్న శివ స్వాములకు అటవీశాఖ ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కొల్లాపూర్ మండలంలోని నల్లమల పరిసర గ్రామాలు నార్లాపూర్, మొలచింతపల్లి, ముక్కిడిగుండం, కొల్లాపూర్ పట్టణంలో శివ మాలధరించి దీక్షలో ఉన్న శివ స్వాములకు మొలచింతలపల్లిలో అటవీ క్వార్టర్ దగ్గర అటవీ శాఖ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నల్లమల గ్రామాలు, అటవీ పరిసర ప్రాంతాలలో జరిగే అగ్ని నివారణ చర్యల గురించి శివ స్వాములకు ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. అడవికి నిప్పు పెడితే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కొల్లాపూర్ అటవీ అధికారులు ఈశ్వర్, లింగాల రేంజ్ సెక్షన్ అధికారులు, ముజీబ్ ఘోరి, శివ, నీలేష్, జయరాజ్, మల్లేష్, బీట్ అధికారులు నవీన్, నాగార్జున, కిరణ్, శ్యామ్, లిఖిత, రామాంజన్, మాధవి, కొల్లాపూర్ రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కండేయ లిఫ్ట్ కాలువ పనులు ప్రారంభం



శాయిన్‌పల్లి శివారులో కాలువ పనులకు ప్రత్యేక పూజలు చేసి పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బిజినేపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన మార్కండేయ లిఫ్ట్ కాలువల పనులకు బుధవారం మండల కాంగ్రెస్ నాయకులు మాజీ పీఏసీఎస్ చైర్మన్ వెంకటస్వామి, మాజీ సర్పంచ్ అవంతి శంకర్, హరీష్ రెడ్డిలు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. మండలంలోని గంగారం, శాయిన్‌పల్లి, వసురాం తండా, కీమ్యాతండాల శివారులోని మార్కండేయ లిఫ్ట్ కాలువల ద్వారా ఎర్రకుంట, ఊర చెరువులను నింపేందుకు కాలువ పనులు మొదలు చేయిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి ఆదేశాల మేరకు పనులు ప్రారంభించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, ప్రేమ్‌లాల్ నాయక్, శివ, రాము ఉన్నారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు

కందనూలు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శ్రీసీతారామ స్వామి దేవాలయంలో మాఘ మాసం పౌర్ణమి సందర్భంగా బుధవారం శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు పది మంది దంపతులతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిత్య విష్ణు సహస్ర పారాయణ కమిటీ సభ్యులు, సాయి భక్తులు స్వామి వారిని కీర్తిస్తూ కీర్తనలు, భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు కందాళై వరదరాజన్ అయ్యంగార్, అన్నప్రసాద కమిటీ సభ్యులు కందాళై జయలక్ష్మి, కందాళై శ్రీనివాసచార్యులు, కరుణశ్రీ, అర్థం రవీందర్, టి.మల్లేష్, రమాదేవి, రత్నమాల, శారద, శివ, పుల్లయ్య, బాలస్వామి, చారి, నరసింహగౌడ్, సాయిభక్తులు, నిత్య విష్ణు సహస్ర పారాయణం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కందనూలు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా జనరల్ ఆసుపత్రిలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘుకు వినతి పత్రం అందజేశారు. కొత్త కాంట్రాక్టర్ వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో జీతాలు ఇంకా రాలేదని ఈ విషయమై సూపరింటెండెంట్‌ను అడగగా టెండర్ అగ్రిమెంట్ చేయించి పూర్తిస్థాయిలో వేతనాలు చెల్లిస్తామని కార్మికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బాలకిష్టమ్మ, రాధ, రేణుక, శ్రీదేవి, ఆలివేల, రంజాన్‌బీ, సుల్తాన్, కృష్ణమ్మ, చిన్నమ్మ, శివలీల, రేవతి, పుష్ప, సర్దార్‌బీ, అక్బర్‌బీ పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

లింగాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ధ్యానంతోనే మనిషికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ప్రచారకర్తలు ఆంజనేయరెడ్డి, శైలజ అన్నారు. బుధవారం మండలంలోని అంబటిపల్లి, శాయిన్‌పేట, దత్తారం, కోమటికుంట ధ్యానంపై వృద్ధులకు, ప్రజలకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిరమిడ్ సభ్యులు ప్రవీణ్, బాలకృష్ణారెడ్డి, జ్ఞానేశ్వరి, మల్లేశ్వర్‌రెడ్డి, స్వప్నలు పాల్గొన్నారు.

విద్యార్థుల విజ్ఞానయాత్ర

కందనూలు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ అటవీ శాఖ వనదర్శిని కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు విజ్ఞాన యాత్ర నిర్వహించినట్లు అటవీ రేంజ్ అధికారి దేవరాజు తెలిపారు. అటవీ విజ్ఞాన కేంద్రంలో గైడ్ శ్వేత ఆధ్వర్యంలో 60మంది విద్యార్థులకు డిజిటల్ మోడ్ పద్ధతిలో వివరించారు. నాగర్‌కర్నూల్ అటవీ రేంజ్ అధికారి దేవరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య, వైస్ ప్రిన్సిపాల్ వనిత, ఉమెన్ ఎంపవర్‌మెంట్ అధికారి ఉమాదేవి పాల్గొన్నారు.

కేసరి కళా వేదిక అధ్యక్షుడిగా వెంకటపతి

నాగర్‌కర్నూల్‌టౌన్, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి) : కేసరి కళా వేదిక జిల్లా అధ్యక్షుడిగా తగిలి వెంకటపతి ఎన్నికయ్యారు. బుధవారం జిల్లా కేంద్రంలోని నిర్వహించిన సంగీత, నాటక, కళాకారుల సమావేశంలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా తగిలి వెంకట స్వామి, ప్రధాన కార్యదర్శిగా వనపట్ల సుబ్బయ్య, ఉపాధ్యక్షులుగా సింగం విజయ్‌గౌడ్, ఎదిరెపల్లి కాశన్న, కార్యదర్శిగా దగిలి రాంచందర్, కోశాధికారిగా ముచ్చర్ల దినకర్, కార్యవర్గ సభ్యులుగా జయమ్మ, బాబుమియ్యా, నరేందర్, మహ్మద్ ఖాజాలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు తగిలి వెంకటపతి మాట్లాడుతూ కేసరి కళా వేదిక ఆధ్వర్యంలో సంగీతం, నృత్యం, పాటలు, నాటకాలతో సామాజిక చైతన్య కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.